సాక్షి గుంటూరు

సోమవారం । 22 । సెప్టెంబర్ । 2025

I



గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ

శలపాడు(చేబ్రోలు): మండలంలోని శలపాడులో ఆదివారం సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహాన్ని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఆవిష్కరించారు. గ్రామ సర్పంచ్ మన్నెం శిరీష పాల్గొన్నారు.



స్టేషన్లలో జిల్లా ఎస్పీ తనిఖీలు

లక్ష్మీపురం: గుంటూరు వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని పట్టాభిపురం, అరండల్‌పేట పోలీస్‌స్టేషన్లను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదివారం పరిశీలించారు.



దుర్గమ్మ సేవలో త్రివిక్రమ్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను సినీ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

ఎంబీఏ, ఎంసీఏ ఉమ్మడి ప్రవేశ పరీక్షకు స్పందన



పెదకాకాని(ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున విద్యాలయం దూరవిద్యా కేంద్రం ఆధ్వర్యంలో 2025–26 విద్యా సంవత్సరానికిగాను నిర్వహించిన రెండేళ్ల ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశ పరీక్షకు అనూహ్య స్పందన లభించిందని కో–ఆర్డినేటర్ ఆచార్య దిట్టకవి రామచంద్రన్ తెలిపారు. దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లుతో కలసి ఆదివారం ఆయన ఏఎన్‌యూలో పరీక్ష నిర్వహణను పరిశీలించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం 10 కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష సజావుగా జరిగినట్లు పేర్కొన్నారు. మొత్తం 720 మంది దరఖాస్తు చేసుకోగా 522 మంది హాజరయ్యారన్నారు. ఇందులో ఎంబీఏకు 449 మంది, ఎంసీఏకు 73 మంది పరీక్ష రాశారని తెలిపారు. ఎంబీఏలో ఇప్పటికే ఉన్న స్పెషలైజేషన్‌తో పాటు నూతనంగా ఎంబీఏ ఫైనాన్స్, ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ వంటి కోర్సులను ప్రవేశపెట్టాలని పలువురు విద్యార్థులు కోరినట్లు ఆయన పేర్కొన్నారు. పరీక్షల ప్రత్యేక పరిశీలకులుగా కె. శశిధర్, ఎన్. బాబు వ్యవహరించారు. ఫలితాలు సోమవారం సాయంత్రం విడుదల అవుతాయని పరీక్షల కో–ఆర్డినేటర్ దిట్టకవి రామచంద్రన్ తెలిపారు.

దసరా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు దసరా సెలవులను పాటించాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సెలవుల్లో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తే సంబంధిత పాఠశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ విషయమై ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు.

పశ్చిమ డెల్టాకు 6,834 క్యూసెక్కులు విడుదల



దుగ్గిరాల: ప్రకాశం బ్యారేజ్ నుంచి 6,834 క్యూసెక్కులు విడుదల చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజీ వద్ద 12 అడుగులు నీటిమట్టం ఉంది. దుగ్గిరాల సబ్ డివిజన్ హైలెవెల్‌కి 140 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్ 1,685, తూర్పు కాలువకు 607, పశ్చిమ కాలువకు 247, నిజాపట్నం కాలువకు 436, కొమ్మూరు కాలువకు 2,980 క్యూసెక్కులు, బ్యారేజీ నుంచి సముద్రంలోకి 2,17,350 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

24 నుంచి డ్రెయిన్స్‌పై ఆక్రమణల తొలగింపు

నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

సాక్షి ఎఫెక్ట్

నెహ్రూనగర్: నగరంలో ఈనెల 24వ తేదీ నుంచి రోడ్లు, డ్రెయిన్స్ మీదకు వచ్చిన ర్యాంపులు, మెట్ల తొలగింపు ప్రక్రియ చేపడతామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు నగరంలో వర్షం పడిన ప్రతిసారి పలు ప్రాంతాలు మునిగిపోవడంతో ఆదివారం సాక్షి దినపత్రికలో 'గుంటూరు నెత్తిన నీటి కత్తి' అనే కథనం ప్రచురితమైంది. దీనికి కమిషనర్ పై విధంగా స్పందించారు. నగరంలో గత ఐదు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల వల్ల పలు ప్రాంతాలు జలమయమయ్యాయని తెలిపారు. రోడ్లమీద పడిన వర్షం డ్రెయిన్‌లలోకి వెళ్లడానికి వీల్లేకుండా ర్యాంపులు, మెట్లు ఏర్పాటు చేయడం వల్లనే ఈ సమస్య ఏర్పడిందని పేర్కొన్నారు. ఇప్పటికే పలు దఫాలుగా స్వచ్ఛందంగా తొలగించుకోమని చెప్పినప్పటికీ కొందరు నిర్లక్ష్యంగా ఉన్నారన్నారు. దీనివల్ల చిన్నపాటి వర్షాలకు కూడా నీరు నిలిచి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వివరించారు. డ్రెయిన్లను మూసేస్తూ ఏర్పాటు చేసిన ర్యాంపులు, మెట్లను మంగళవారం సాయంత్రం లోపు తొలగించుకోవాలని, లేనిపక్షంలో బుధవారం ఉదయం నుంచి నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక సిబ్బంది వార్డుల వారీగా జేసీబీలతో తొలగింపు ప్రక్రియ చేస్తారని తెలిపారు. జరిగిన నష్టానికి సంబంధిత నిర్మాణదారులే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు.



అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న ప్రభుత్వం



ప్రజా ప్రయోజనాలతో వార్తలు ప్రచురించినప్పుడు అవి అధికార పార్టీకి అనుకూలంగా లేకపోతే సంబంధిత విలేకరులపై కేసులు పెట్టడం అధికార దుర్వినియోగం అవుతుంది. ప్రజల స్వేచ్ఛని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని విలేకరులపై, పత్రికలపై అక్రమ కేసులు పెట్టి వేధించడం ప్రభుత్వానికి తగదు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య పత్రికలు వారధి వంటివి. ప్రజా ప్రయోజనాలతో ఎలాంటి వార్తలనైనా ప్రచురించే హక్కు పత్రికలకు ఉంటుంది. అలాంటి స్వేచ్ఛను ఒక వర్గం అణచివేయడం దారుణమైన విషయం. ప్రజాహితం కోరే పత్రికా స్వేచ్ఛ ఈ సమాజంలో నిలబడాలి. విలేకరులపై తప్పుడు కేసులు పెట్టే సంస్కృతిని ఎవరైనా ఖండించాల్సిందే !

– మెరుగుపాల రాజారత్నం, సీనియర్ జర్నలిస్ట్

విమర్శలకూ భయపడుతున్న ప్రభుత్వం



ప్రభుత్వంపై విమర్శలు చేసిన వారిపై కేసులు పెట్టడం తొలిసారిగా కూటమి పాలనలోనే చూస్తున్నాం. గతంలో ఎక్కడా చూడలేదు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చని ప్రభుత్వం.. ఎవరైనా విమర్శిస్తే చాలు కేసులు పెడుతోంది. పత్రికలు విమర్శిస్తే చాలు కూటమి ప్రభుత్వం భయపడుతోంది. సాక్షి ఎడిటర్‌పై, విలేకరులపై ఇప్పటికైనా ప్రభుత్వం కక్షపూరిత కేసులు పెట్టడం మానుకోవాలి. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. లేదంటే ప్రజలే తిరగబడి ప్రశ్నిస్తారు. ఈ విషయాన్ని అధికారంలోని పాలకులు, ఆయా పార్టీల నాయకులు గుర్తించుకోవాలి.

– బుర్రముక్కు వేణుగోపాల స్వామి రెడ్డి, తాడేపల్లి పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, పొన్నూరు నియోజకవర్గ పరిశీలకులు

కూటమి కక్షపై పోరుబాట

- ప్రభుత్వ సవతి తల్లి ప్రేమపై తిరుగుబాటు
- సర్వేల పేరుతో సిబ్బందికి వేధింపులు
- సమస్యల పరిష్కారానికి ముందుకు రాని ప్రభుత్వం
- సిబ్బంది కొరతతో వెలవెలబోతున్న సచివాలయాలు
- జిల్లాలో 568 గ్రామ, వార్డు సచివాలయాల్లో 4,747 మంది సిబ్బంది

నేటి నుంచి సచివాలయ ఉద్యోగుల సమ్మె ?



జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాకు సమ్మె నోటీసుతో పాటు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న సచివాలయ ఉద్యోగ సంఘ నాయకులు (ఫైల్)

గుంటూరు వెస్ట్: ఉద్యోగమంటే అధికారాన్ని చెలాయించడం కాదు.. అది ప్రజలకు సక్రమమైన సేవలందించేందుకే ఉపయోగించాలి.. అతి సాధారణ వ్యక్తికి సైతం తన సమీపంలోనే నాణ్యమైన ప్రభుత్వ సేవలు లభించాలనే లక్ష్యంతో నాటి ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను అక్టోబర్ 2, 2019లో రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారు. సుమారు 1,26,000 ప్రభుత్వ ఉద్యోగాలను ఒక్క రూపాయి లంచం లేకుండా, ఏ అధికారి, ప్రజాప్రతినిధి సిఫార్సు లేకుండా భర్తీ చేశారు. అయితే, 2024లో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సచివాలయాల పరిస్థితి దారుణంగా తయారైంది. జిల్లాలో ఉన్న సుమారు 10 వేల మంది వలంటీర్లను తొలగించారు. అప్పట్లో ఒక్కొక్క సచివాలయంలో 11 మంది ఉద్యోగులుండేవారు. ఇప్పుడు కొన్ని సచివాలయాల్లో ముగ్గురు కూడా ఉండడం లేదు. సిబ్బందిపై అనేక సర్వేల పేరుతో కూటమి ప్రభుత్వం పని ఒత్తిడిని పెంచుతోంది. ఏడాదిగా ఉద్యోగులు మొరపెట్టుకుంటున్నా ప్రభుత్వం కనీసం పరిశీలన కూడా చేయకపోవడంతో తిరుగుబాటుకు సిద్ధమయ్యారు. ఈ నెల 22 నుంచి సమ్మె చేస్తామని ఇప్పటికే అన్ని జిల్లా కలెక్టర్లకు వినతి పత్రాలు అందజేశారు.

పని భారంతో సతమతం

గుంటూరు జిల్లాలో మొత్తం 568 సచివాలయాలున్నాయి. అందులో 336 గ్రామ, 232 వార్డు సచివాలయాలున్నాయి. వీటిలో 4,747 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. సుమారు 500 పైగా ప్రభుత్వ సేవలందిస్తున్నారు. గతంలో ఒక వలంటీర్‌కు ఒక క్లస్టర్ అప్పగించారు. ఇప్పుడు ఒక ఉద్యోగికి నాలుగు క్లస్టర్స్ అప్పగించి మితిమీరిన పని భారాన్ని మోపుతున్నారు. ప్రతి జిల్లాలో మూడు విభాగాలుగా సచివాలయ వ్యవస్థను విభజించారు. 2,500 అంతకంటే తక్కువ జనాభా కలిగిన ప్రాంతాన్ని ఏ విభాగంగా గుర్తించి అందులో ఆరుగురిని నియమించారు. 2,500–3,500 మధ్యలో జనాభా ఉన్న ప్రాంతాన్ని గుర్తించి ఏడుగురిని, 3,500 అంతకు మించి ఉన్న జనాభా ప్రాంతాలను గుర్తించి ఎనిమిది మందిని నియమించారు. అయితే, ఉద్యోగ సంఘ నాయకులు వాదన మరో లాగా ఉంది. కొన్ని సచివాలయాల్లో కనీసం ముగ్గురు కూడా లేరంటున్నారు. డెప్యుటేషన్‌పై ఇతర పనులకు వాడుకుంటున్నారంటున్నారు. ఎనిమిది మంది ఉద్యోగులు, వలంటీర్లు చేయాల్సిన పనిని ముగ్గురు చేయాల్సి వస్తుందని, దీంతో విపరీతమైన ఒత్తిడి పెరుగుతోందని వాపోతున్నారు. ప్రజలు కూడా నాణ్యమైన సేవలు పొందలేకపోతున్నారని పేర్కొంటున్నారు. మరో పక్క ప్రతి జిల్లా స్థాయి అధికారి సచివాలయ ఉద్యోగులపై అజమాయిషీ చెలాయిస్తుండటం ఇబ్బందిగా మారింది.

ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని కాపాడాలి



గత కొన్ని నెలల నుంచి రాష్ట్రంలోని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల విధులు రోడ్లకే పరిమితమయ్యాయి. క్షేత్రస్థాయిలో అవమానకర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ఉద్యోగుల ఆత్మ గౌరవాన్ని కాపాడే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి 15 రోజుల గడువుతో ఉద్యమ కార్యాచరణ నోటీసు ఇచ్చాం.. అయినప్పటికీ చలనం లేదు.. మరో వారం రోజుల్లో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం. మా సమస్యలను పరిష్కరించే వరకు ప్రభుత్వంతో ప్రత్యక్షంగా పోరాడుతాం.

–షేక్ అబ్దుల్ రజాక్, రాష్ట్ర కన్వీనర్, ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక

సర్వేలతో తీవ్ర ఒత్తిడి



ప్రస్తుతం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు సర్వేలతో తీవ్ర పని ఒత్తిడికి గురవుతున్నారు. కొన్నిచోట్ల రేషన్ సరుకులు పంపిణీ చేయాలని కూడా ఆదేశాలు ఇచ్చారు. తమను మాతృ శాఖలో విలీనం చేయాలి. ఆర్థిక ఆర్థికేతర సర్వీస్ అంశాలను 15 రోజుల్లోపు పరిష్కరించాలి. లేనిపక్షంలో ఉద్యమ కార్యాచరణలోకి వెళ్తాం. ఇప్పటికే సచివాలయాల శాఖ డైరెక్టర్‌కు నోటీసులు అందజేసాం.

– గోలి ధనలక్ష్మి, రాష్ట్ర కోశాధికారి, ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక

తప్పని పరిస్థితుల్లోనే సమ్మె



అందరూ ఉన్నత చదువులతో ఈ ఉద్యోగాలు పొందాం. ఒక ప్రభుత్వ ఉద్యోగి ఎన్ని సేవలు చేయగలడో ఆలోచించడం లేదు. మేము చెబుతుంటే కనీసం వినే నాథుడే లేడు. చాలా బాధగా ఉంది. మా సమస్యలు ప్రభుత్వం కాక ఇంకెవరు తీరుస్తారు ? తప్పని పరిస్థితుల్లోనే సమ్మె బాటకు పిలుపునిచ్చాం. ప్రభుత్వం భేషజాలకు పోకుండా ముందుకు వచ్చి సమస్య పరిష్కరించాలి.

– పి.మధు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ఏపీ సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక

సచివాలయ ఉద్యోగుల డిమాండ్స్

- నిబంధనల మేరకు కార్యాలయంలో విధులు మాత్రమే కేటాయించాలి.
- వలంటీర్లు చేయాల్సిన పనులు తమతో చేయించరాదు.
- బీటెక్, ఎంబీఏలు చదువుకుని అర్హత పరీక్ష ద్వారా ఎంపికైన తమకు దానికి తగ్గ బాధ్యతలు మాత్రమే అప్పగించాలి.
- గ్రామ, వార్డు ఉద్యోగులను మాతృ శాఖలకు అప్పగించాలి.
- సెలవులు, పండుగల సమయాల్లో బలవంతపు పనులు, ఇంటింటి సర్వేల నుంచి విముక్తి కలిగించాలి.
- ఆరేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులకు ఏఏఎస్ ప్రకారం ప్రత్యేక ఇంక్రిమెంట్లు ఇవ్వాలి.
- విధి నిర్వహణలో తమకు భద్రత కల్పించాలి.
- సచివాలయాల్లో మౌలిక వసతులు కల్పించాలి.



సచివాలయం (ఫైల్)

అతిసార కట్టడికి ఇంటింటి సర్వే

- జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా
- 33 బృందాలు ఏర్పాటు

గుంటూరు వెస్ట్: అతిసార లక్షణాలు కనిపించిన ప్రాంతాల్లో 33 బృందాలతో ఇంటింటి సర్వే జరుగుతోందని జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి అందించిన వివరాల మేరకు, 16వ తేదీ నుంచి ఇప్పటి వరకు 80 కేసులు నమోదు అయ్యాయని పేర్కొన్నారు. మిగిలిన కేసులు అంతకముందు విరేచనాలు లేదా వాంతులు తదితర కారణాలుతో నమోదయ్యాయని తెలిపారు. అత్యవసర వార్డు నుంచి సాధారణ వార్డులకు 13 మందిని మార్చారని, 11 మంది డిశ్చార్జి అయినట్లు వివరించారు. పాత గుంటూరు, సంగడి గుంట, ఎల్.బి.నగర్ తదితర ప్రాంతాలను రెడ్ జోన్‌గా గుర్తించి విస్తృతంగా సర్వే చేస్తున్నామని వెల్లడించారు. సర్వే చేస్తున్న ప్రాంతాల్లో అతిసార లక్షణాలు గల ఆరుగురిని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స అందించామని తెలిపారు. అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు రేయింబవళ్లు పనిచేసే విధంగా చర్యలు చేపట్టామని వివరించారు. నగర ప్రజలంతా ఆర్‌ఓ, కుళాయి నీటిని లేదా మరగ కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలని, చేతులు శుభ్రంగా కడగాలని తెలిపారు. అనారోగ్య లక్షణాలు ఉంటే తక్షణం దగ్గరలోని ఆసుపత్రికి వెళ్లాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. వ్యాధుల సమాచారం అందించేందుకు కలెక్టర్‌ట్‌లో కంట్రోల్ రూంను 08963– 2234014 నంబరుతో ఏర్పాటు చేశామని, దానికి సమాచారం అందించవచ్చని తెలిపారు. నగరపాలక సంస్థలు, పంచాయతీ పరిధుల్లో పారిశుద్ధ్యం నిర్వహణ పక్కాగా చేపట్టాలని, తాగునీటిపై పూర్తి అప్రమత్తంగా ఉండాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. గుంటూరు నగరపాలక సంస్థ అధికారులు కూడా ఆదివారం రహదారి పక్కన తినుబండారాల విక్రయాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. ఏ ప్రాంతం నుంచైనా అవాంఛనీయ సంఘటనలు నమోదయినా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. పరిస్థితులకు అనుగుణంగా అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

నేటి నుంచి శివాలయంలో దసరా ఉత్సవాలు

పెదకాకాని: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో 22 నుంచి అక్టోబరు 2 వరకూ దేవీ శరన్నవరాత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు డీసీ గోగినేని లీలాకుమార్ ఆదివారం తెలిపారు. ఉత్సవాల్లో ప్రతి నిత్యం సుప్రభాత సేవ, పంచ హారతులు, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనాలు, పంచగవ్య ప్రాశనలు శాస్త్రోక్తంగా జరుగుతాయని తెలిపారు. శరన్నవరాత్రోత్సవాలు పురస్కరించుకుని భ్రమరాంబ అమ్మవారు బాలా త్రిపుర సుందరీ దేవి, గాయత్రీ దేవి, అన్నపూర్ణాదేవి, లలితా త్రిపురసుందరీదేవి, కదంబ వనవాసినీదేవి, సరస్వతీదేవి, దుర్గాదేవి, మహిషాసురమర్దనీ దేవి, రాజరాజేశ్వరీదేవి అలంకరణలో భక్తులను అనుగ్రహిస్తారని వివరించారు. అక్టోబరు 2 విజయదశమి రోజున ఉదయం మహాపూర్ణాహుతి, సాయంకాలం శమీపూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు ఏవో తెలిపారు. అనంతరం శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి గ్రామోత్సవం అత్యంత వైభవంగా జరుగుతుందని తెలియజేశారు. ప్రతిరోజూ విశేష పూజలతో పాటు రాత్రివేళల్లో భక్తులకు కాలక్షేపంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని తెలిపారు.



కళకళలాడుతున్న ఆలయ ప్రాంగణం

నేడు బాలా త్రిపురసుందరీ దేవిగా భ్రమరాంబ

తొలిరోజు భ్రమరాంబ అమ్మవారు బాలా త్రిపుర సుందరీ దేవిగా భక్తులను అనుగ్రహిస్తారు. సోమవారం తెల్లవారుజామున సుప్రభాతసేవ, హారతులతో పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. సాయంత్రం 5 గంటలకు అమ్మవారికి కుంకుమార్చనలు, పంచహారతులు, ఆలయ ప్రదక్షిణ, తీర్థ ప్రసాదాల పంపిణీ ఉంటాయి. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా భజన, కూచిపూడి నృత్యం, పౌరాణిక నాటకాల్లోని సన్నివేశాలు ఉంటాయి.

కిడ్నాప్, హత్య కేసులో నలుగురు అరెస్ట్

వివరాలు వెల్లడించిన వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ కె.అరవింద్

లక్ష్మీపురం: వివాహేతర సంబంధం నేపథ్యంలో ఓ వ్యక్తిని కిడ్నాప్ చేసి విద్యుత్ తీగతో గొంతు నులిమి హతమార్చి మృతదేహాన్ని గుండ్లకమ్మ కాలువలో పడేసిన కేసులో నలుగురు నిందితులను నగరంపాలెం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గుంటూరు వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని నగరంపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రాత్రి వెస్ట్ డీఎస్పీ కె.అరవింద్ వివరాలు వెల్లడించారు. ఈనెల 7వ తేదీన సీతమ్మ కాలనీకి చెందిన వేముల రామాంజనేయులు కనిపించడం లేదని ఆయన భార్య శివపార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నగరంపాలెం ఎస్సై రమాదేవి, మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ సూచనల మేరకు వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ కె.అరవింద్, స్టేషన్ ఇన్‌చార్జి సీఐ ఆరోగ్యరాజు, ఎస్సైలు రాంబాబు, ప్రసన్నకుమార్, రమాదేవి, పట్టాభిపురం ఎస్సై నాగేంద్రలు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ముమ్మరం చేశారు. అదే ప్రాంతానికి చెందిన బండారు కొండయ్యపై అనుమానం వ్యక్తం చేసి స్టేషన్‌కు తరలించి విచారించారు. కొండయ్య భార్య శ్రీలక్ష్మికి, వేముల రామాంజనేయులు మధ్య గతంలో వివాహేతర సంబంధం ఉండేది. దీనిని ఆసరాగా తీసుకుని శ్రీలక్ష్మిని రామాంజనేయులు తరచూ డబ్బులు అడుగుతూ ఇబ్బందులకు గురి చేయడం ప్రారంభించాడు. ఈ విషయాన్ని ఆమె భర్త కొండయ్యకు తెలియజేసింది. రామాంజనేయులు వేధింపులు భరించలేకపోతున్నానని, ఎలాగైనా హతమార్చమని చెప్పింది. ఈనెల 6వ తేదీన మధ్యాహ్నం 4 గంటల సమయంలో కొండయ్య తన స్నేహితులైన ఏసుభక్తనగర్ ప్రాంతానికి చెందిన కోలా దిలీప్, వికలాంగుల కాలనీ, కేవీపీ కాలనీకి చెందిన నాగుల్ మీరాలతో కలసి హత్యకు పథకం రచించారు. నాగుల్ మీరా ద్వారా రామాంజనేయులుకు ఫోన్ చేసి హౌసింగ్ బోర్డు కాలనీ సెంటర్ వద్ద ఉన్న పెట్రోల్ బంక్ వెనుక నుంచి అంకిరెడ్డిపాలెం వెళ్లే దారిలో ఉన్న డంపింగ్ యార్డ్ వద్దకు పిలిపించారు. కొండయ్య, దిలీప్, నాగుల్ మీరాలు ముగ్గురు కలిసి రామాంజనేయులును కారులో బలవంతంగా ఎక్కించారు. అంకిరెడ్డిపాలెం నుండి హైవే వైపు తీసుకెళ్లి, పొత్తూరు ఈనాడు ఆఫీస్ సమీపంలో హైవే సర్వీస్ రోడ్‌లో కారు ఆపారు. కొండయ్య, రామాంజనేయులుతో గొడవ పడ్డాడు. కారు ముందు సీటులో కూర్చుని ఉన్న రామాంజనేయులు మెడకు వెనుక కూర్చున్న కోలా దిలీప్, నాగుల్ మీరాల సహాయంతో కరెంటు వైర్‌తో బిగించి హతమార్చారు. ముగ్గురూ కలిసి కారులో ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం, వెల్లంపల్లి గ్రామ పరిధిలోని గుండ్లకమ్మ వాగు బ్రిడ్జిపై నుంచి నీటిలో రామాంజనేయులు మృతదేహాన్ని పడేశారు. బయటకు కనబడకుండా దానిపై ఇసుక మూటలు వేశారు. కొండయ్య తెలిపిన విధంగా ఈనెల 15న పోలీసులు గుండ్లకమ్మ వాగు వద్దకు వెళ్లి పరిశీలించి, 16వ తేదిన మృతదేహాన్ని గుంటూరు జీజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఈ కేసులో మిగిలిన కోలా దిలీప్, నాగుల్‌మీరాలతోపాటు కొండయ్య భార్య శ్రీ లక్ష్మిని ఆదివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు త్వరితగతిన పూర్తి చేసిన సీఐ ఆరోగ్యరాజు, ఎస్సైలు రాంబాబు, ప్రసన్నకుమార్, రమాదేవి, నాగేంద్రలతో పాటు సిబ్బంది శ్రీనివాస్, ఉదయ్‌చంద్, గంగరాజ్, నాగరాజులను డీఎస్పీ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కె.అరవింద్, పక్కన నగరపాలెం ఇన్‌చార్జి సీఐ ఆరోగ్యరాజు

న్యాయం చేస్తారా లేదా మాకు అప్పగిస్తారా ?

- ఎంఈవోతో పాటు హెచ్‌ఎం, టీచర్ల పైనా కేసు నమోదు చేయాలి
- పోలీస్ స్టేషను ఎదుట రావిపాటివారిపాలెం గ్రామస్తుల ఆందోళన

ప్రత్తిపాడు:'' పసి పిల్లలపై నీచంగా, అసభ్యకరంగా ప్రవర్తించిన వృద్ధుడిని కఠినంగా శిక్షించి మాకు న్యాయం చేస్తారా.. లేక నిందితుడిని అప్పగిస్తారా ?'' అంటూ మహిళలు, గ్రామస్తులు ఆందోళనకు దిగారు. ప్రత్తిపాడు మండలం రావిపాటివారిపాలెం ప్రాథమిక పాఠశాలలో స్కావెంజర్ భర్త 72 ఏళ్ల వృద్ధుడు సామియేలు విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించిన విషయం తెలిసిందే. అతడి అరెస్టు విషయంలో ఎందుకు తాత్సారం చేస్తున్నారంటూ ఆదివారం రాత్రి రావిపాటివారిపాలెం గ్రామస్తులు పెద్ద ఎత్తున స్థానిక పోలీస్ స్టేషను వద్దకు చేరుకుని ఆందోళన చేశారు. పాఠశాలకు సంబంధం లేని వ్యక్తిని నెలల తరబడి పాఠశాలలోకి హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఎలా అనుమతిస్తున్నారని మండిపడ్డారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ, తప్పు చేసిన వారిని కాపాడేందుకు ప్రయత్నాలు చేస్తున్న ఎంఈవోతో పాటు హెచ్‌ఎం, ఉపాధ్యాయులపైనా వెంటనే కేసు నమోదు చేయాలని కోరారు. ఎస్ఐ నరహరి మాట్లాడుతూ నిందితుడిని ఆదివారం అదుపులో కి తీసుకుని అరెస్టు చేశామని, చట్టప్రకారం అతడిని కోర్టుకు హాజరు పరచనున్నట్లు చెప్పారు. మరలా రెండు నెలల్లో బయటకు వచ్చి తిరుగుతాడని, ఒక్కసారి తమకు అప్పగించాలని పట్టుబట్టారు. దీంతో ఎస్ఐ చట్టాన్ని చేతుల్లోనికి తీసుకోవడం సరికాదని తెలిపారు. బాధిత పిల్లల తల్లిదండ్రులు స్టేషనుకు వచ్చిన వెంటనే కేసు నమోదు చేశామని, ఎలాంటి తాత్సారం చేయలేదని ఎస్ఐ స్పష్టం చేశారు.



పోలీస్ స్టేషను ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

చట్ట ప్రకారం చర్యలు

గుంటూరు ఎడ్యుకేషన్: నాగమ్మ భర్త విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన సంఘటనపై పోలీసు కేసు నమోదు చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

క్లుప్తంగా

జిల్లాతో ప్రత్యేక అనుబంధం

పూర్వ కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జేసీ భార్గవ్ తేజ



గుంటూరు వెస్ట్: ఇటీవల జెన్కో మేనేజింగ్ డైరెక్టర్‌గా బదిలీ అయిన గుంటూరు జిల్లా పూర్వ కలెక్టర్ ఎస్. నాగలక్ష్మిని, సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ గా బదిలీ అయిన పూర్వ సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్ తేజను జిల్లా రెవెన్యూ యంత్రాంగం ఆధ్వర్యంలో శనివారం రాత్రి కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాలులో ఘనంగా సత్కరించారు. ఇద్దరూ మాట్లాడుతూ జిల్లాతో ప్రత్యేక అనుబంధం ఏర్పడిందని తెలిపారు. ఉద్యోగులు, అధికారులు, ఉద్యోగ సంఘ నాయకులు తమకు ఎంతో సహకారమందించారని చెప్పారు. నూతన కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా మార్గదర్శకత్వంలో జిల్లా మరింత అభివృద్ధి చెందుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం నాగలక్ష్మి, భార్గవ్ తేజను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.ఎస్. కె ఖాజావలి, గుంటూరు రెవెన్యూ డివిజన్ అధికారి కె. శ్రీనివాసరావు, రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షులు కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన అధికారులు



నగరంపాలెం: స్థానిక నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో ఆదివారం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌ను గుంటూరు జిల్లా జైళ్ల శాఖ, రవాణా శాఖ అధికారులు మర్యాద పూర్వకంగా కలిసి, మొక్కలు, పూలబోకేను అందించారు. పోలీస్, రవాణా, జైళ్ల శాఖ సమన్వయంతో పని చేద్దామని జిల్లా ఎస్పీ అన్నారు. జిల్లా ఎస్పీని కలిసిన వారిలో ఉప రవాణా కమిషనర్ కె.సీతారామిరెడ్డి, ప్రాంతీయ రవాణాధికారి ఎ.శ్రీహరి, జిల్లా జైలు సూపరింటెండెంట్ ఏబీ.కాంతారాజు ఉన్నారు.

జిల్లాలో సగటు వర్షపాతం 25.7 మి.మీ.


కొరిటిపాడు(గుంటూరు): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వల్ల గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు అత్యధికంగా గుంటూరు పశ్చిమలో 74.2 మిల్లీమీటర్లు వర్షం కురవగా, అత్యల్పంగా పొన్నూరు మండలంలో 4.2 మి.మీ. కురిసింది. సగటున 25.7 మి.మీ వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. దుగ్గిరాల మండలంలో 57.8 మి.మీ., తాడేపల్లి 49.6, తుళ్లూరు 44.6, గుంటూరు తూర్పు 40.2, మంగళగిరి 38.2, పెదకాకాని 29.8, పెదనందిపాడు 29.2, ప్రత్తిపాడు 20, తాడికొండ 19, మేడికొండూరు 13.8, ఫిరంగిపురం 11.2, చేబ్రోలు 7.2, తెనాలి 6.8, కొల్లిపర 6.2, వట్టిచెరుకూరు 5, కాకుమాను మండలంలో 4.8 మి.మీ. చొప్పున వర్షం కురిసింది. సెప్టెంబర్ 21వ తేదీ నాటికి జిల్లాలో సాధారణ వర్షపాతం 111.6 మి.మీ కురవాల్సి ఉండగా, ఇప్పటి వరకు 206.5 మి.మీ నమోదైంది.

క్యాన్సర్‌కూ ఉంది ఆన్సర్

- బాధితులకు భరోసా
- గుంటూరు జీజీహెచ్‌లో ఉచితంగా కార్పొరేట్ వైద్యం
- ఆధునిక చికిత్సలతో నివారణ
- నేడు వరల్డ్ రోజ్ డే

రోజ్ డే నేపథ్యం

కెనడా దేశానికి చెందిన 12 ఏళ్ల మెలిండా రోజ్ అనే బాలిక 1994లో క్యాన్సర్ వ్యాధికి గురైంది. అది కూడా చాలా అరుదైన బ్లడ్ క్యాన్సర్. కొన్ని వారాల్లోనే చనిపోతుందని దాక్టర్లు చెప్పడంతో తల్లిదండ్రులు చాలా బాధపడ్డారు. కాని రోజ్ భయపడకుండా ఆస్పత్రిలో ఉన్న రోగులకు రోజా పువ్వులు అందించేది. వారికి కవితలు వినిపించి రోగుల్లో మనో ఉల్లాసాన్ని కలిగించేది. ఇలా ఆరునెలల పాటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రోగులను చిరునవ్వుతో పలుకరిస్తూ ఉండేది. ఉత్తరాలు రాస్తూ వారిలో ఆనందం, ఉత్సాహాన్ని నింపుతూ సెప్టెంబరు 22న మరణించింది. ఆ బాలిక జ్ఞాపకార్థం ప్రతి ఏడాది రోజ్ డేను నిర్వహిస్తున్నారు.



గుంటూరు మెడికల్: క్యాన్సర్ .. ఈ వ్యాధి పేరు చెబితేనే చాలా మందికి ఒంట్లో వణుకు పుడుతుంది. వస్తే చనిపోవటమే అనే అపోహల్లో ప్రజలు ఉన్నారు. పూర్వ రాచపుండుగా పిలువబడే క్యాన్సర్ వ్యాధికి చికిత్స ఉండేది కాదు. వ్యాధిగ్రస్తులు మరణానికి రోజులు లెక్క బెట్టుకుంటూ గడిపేవారు. ప్రస్తుతం ఈ పరిస్థితి మారింది. ఆధునిక వైద్యం అందుబాటులోకి వచ్చింది. వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చు. బాధితుల్లో భయాన్ని పోగొట్టి వారిలో మానసిక ధైర్యాన్ని నింపేందుకు ప్రతి ఏడాది ప్రపంచ వ్యాప్తంగా సెప్టెంబరు 22న రోజ్ డే వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.



జీజీహెచ్‌లోని క్యాన్సర్ వార్డు

క్యాన్సర్‌కు కారణాలు

క్యాన్సర్ రావటానికి ప్రధాన కారణం పొగాకు ఉత్పత్తుల వినియోగమే. సిగిరెట్, బీడీ, చుట్ట , పాన్‌పరాగ్, ఖైనీ, గుట్కా.. ఇలా ఏ రూపంలో పొగాకును తీసుకున్నా వస్తుంది. మద్యపానం, వ్యాయామం చేయకపోవడం, ఆకు కూరలు తినకపోవడం, ఊరగాయ పచ్చళ్లు, కొవ్వు ఎక్కువగా ఉన్న మాంసాహారం తినడం, అధిక బరువు ఉండటం వల్ల కొన్ని రకాల క్యాన్సర్లు వచ్చే అవకాశం ఉంది.

జీజీహెచ్‌లో చికిత్స పొందిన వారి వివరాలు

సంవత్సరం	రోగుల సంఖ్య	ఆపరేషన్లు
2020	2067	-
2021	5,865	114
2022	13,107	395
2023	14,647	753
2024 ఆగస్టు వరకు	9,376	542



పెట్‌స్కాన్ వైద్య పరికరం

జీజీహెచ్‌లో అత్యాధునిక వైద్య సేవలు

గుంటూరు జీజీహెచ్‌లో 2020 జులైలో అత్యాధునిక క్యాన్సర్ వైద్య సేవలు అందించేందుకు నాట్కో క్యాన్సర్ సెంటర్‌ను మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. కోట్ల రూపాయలతో పెట్ స్కాన్‌ను ఏర్పాటు చేశారు. 100 పడకలతో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశారు.

అందుబాటులో ఆధునిక వైద్యం



క్యాన్సర్‌కు నేడు ఆధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. ఇమ్యూనోథెరపీ, టార్గెట్‌థెరపీ ద్వారా త్వరగా కోలుకుంటున్నారు. నెక్స్ట్ జనరేషన్ సీక్వెన్సింగ్ టెస్ట్ ద్వారా చాలా త్వరగా గుర్తించవచ్చు. ఏ జీన్‌లో తేడా వల్ల సోకుతుందనే విషయం తేటతెల్లమవుతుంది. కుటుంబంలో ఒకరికి క్యాన్సర్ ఉంటే ఇతరులకు వచ్చే అవకాశం ఉందా లేదా నిర్ధారించే బీఆర్‌సీఏ-1, 2 పరీక్షలు ఉన్నాయి. లాప్రోస్కోపిక్, రొబోటిక్ సర్జరీలు అందుబాటులో ఉన్నాయి.

–డాక్టర్ ఎం.జి.నాగకిశోర్, సీనియర్ సర్జికల్ అంకాలజిస్ట్, గుంటూరు

అన్నీ ఉచితమే..



రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా రూ. 45 కోట్లతో ప్రభుత్వ సహకారంతో గుంటూరు జీజీహెచ్‌లో నాట్కో క్యాన్సర్ సెంటర్ ఏర్పాటైంది. ప్రపంచస్థాయి వైద్య ప్రమాణాలతో వ్యాధిగ్రస్తులకు ఉచితంగా కార్పొరేట్ వైద్య సేవలు అందిస్తున్నాం. రూ. కోట్లు ఖరీదు చేసే అత్యాధునిక లీనియర్ యాక్సిలేటర్, బ్రాకీథెరపీ, సీటీ స్టిమ్యులేటర్, పెట్‌స్కాన్ వైద్య పరికరాలు ప్రభుత్వం అందజేసింది. క్యాన్సర్ చివరి దశలో ఉన్నవారికి సైతం ప్యాలేటివ్ కేర్ చికిత్సలు అందిస్తున్నాం. మందులు కూడా ఉచితంగా అందించి రోగుల్లో మనోధైర్యం కల్పిస్తున్నాం. మరో వంద పడకలతో క్యాన్సర్ సెంటర్‌ను నిర్మాణం చేస్తున్నాం.

– నన్నపనేని సదాశివరావు, నాట్కో ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్

స్క్రీనింగ్ పరీక్షలతో చెక్



స్క్రీనింగ్ పరీక్షల ద్వారా క్యాన్సర్‌కు చెక్ పెట్టవచ్చు. ముఖ్యంగా మహిళలు 45 సంవత్సరాలు దాటాక ప్రతి ఏడాది మ్యామో గ్రామ్ పరీక్ష చేయించుకోవాలి. 55 సంవత్సరాలు దాటిన వారు సీ టీ స్కాన్, కొలనోస్కోపి చేయించుకోవాలి. తొమ్మిదేళ్ల నుంచి 11 ఏళ్లలోపు బాలికలకు, 45 సంవత్సరాల్లోపు మహిళలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించడం ద్వారా క్యాన్సర్ రాకుండా నివారించవచ్చు. హెపటైటీస్ బీని కూడా వ్యాక్సిన్ వేయించుకుని రాకుండా నిరోధించవచ్చు.

– డాక్టర్ బైరపనేని స్రవంతి, మెడికల్ అంకాలజిస్ట్

రేవేంద్రపాడులో వెయిట్ లిఫ్టింగ్ జట్టు ఎంపికలు



దుగ్గిరాల: విద్యార్థులు చదువుతో పాటు ఆటలు కూడా ముఖ్యమని అని హెచ్.ఎం బి.వి.కృష్ణారావు చెప్పారు. మండలంలోని రేవేంద్రపాడు జెడ్పీ హైస్కూలులో ఆదివారం జిల్లాస్థాయి వెయిట్ లిఫ్టింగ్ జట్టు ఎంపికలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గేమ్స్ ఫెడరేషన్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో 17 నుంచి 19 సంవత్సరాల బాలబాలికల విభాగంలో ఎంపికలు జరిగినట్లు తెలిపారు. విద్యార్థులు చురుగ్గా ఉండటానికి ఆటలు ఆడాలని, దేహ దారుఢ్యం కూడా పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు నాగ శిరీష, రాంబాబు, వివిధ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

99 అడుగుల మహాగణపతి కమిటీపై ఫిర్యాదు

గుంటూరు రూరల్: తమలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించుకుని డబ్బులు ఇవ్వకుండా పరారయ్యారని జిల్లా ఎస్పీకి కళాకారులు ఆదివారం ఫిర్యాదు చేశారు. బాధితుడు, శ్లోక ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గంట స్వామి ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. రెడ్డిపాలెం ఇన్నర్ రింగ్ రోడ్‌లోని శ్రీ చైతన్య కళాశాల గ్రౌండ్ 99 అడుగుల మట్టి మహాగణపతిని ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసింది. నగరంలో ఉన్న వివిధ సాంస్కృతిక సంస్థలతో కలసి శ్లోకా ఫౌండేషన్ ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 20 వరకు నిత్యం శాస్త్రీయ నృత్యాలతో పాటు పలు కార్యక్రమాలు నిర్వహించింది. ఉత్సవాల అనంతరం కళాకారులకు సొమ్మును ఇవ్వకుండా కమిటీ ప్రెసిడెంట్ నరేంద్రరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రాజానాయుడు, సెక్రటరీ లక్ష్మీరెడ్డిలు అందుబాటులో లేరని ఫిర్యాదు చేశారు. ఫోన్ ద్వారా కూడా సమాధానం చెప్పకుండా తప్పించుకొని వెళ్లి పోయారని ఆరోపించారు. కళాకారులు, చిన్నారులు, మహిళలు, మేకప్ మేన్‌కు రూ 1,75,000 ఇవ్వాలని తెలిపారు. వెంటనే నగదు ఇప్పించాలని స్వామి ఎస్పీకి విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ తీరుపై ఉపాధ్యాయుల్లో తీవ్ర వ్యతిరేకత



రణభేరి పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కేఎస్ లక్ష్మణరావు, యూటీఎఫ్ నాయకులు

- మాజీ ఎమ్మెల్సీ కేఎస్. లక్ష్మణరావు
- ఈనెల 25న రణభేరి సభ

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వం అమలు చేస్తున్న అకడమిక్ విధానాలపై ఉపాధ్యాయులు తీవ్రమైన వ్యతిరేకతతో ఉన్నారని మాజీ ఎమ్మెల్సీ కేఎస్. లక్ష్మణరావు తెలిపారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 25న తలపెట్టిన రణభేరి సభ పోస్టర్లను ఆదివారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించారు. కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఈనెల 25న శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యలు, విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి బహిరంగసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలైనా డీఏ, ఐఆర్ ఇవ్వకపోవడంపై ఉద్యోగులు, ఉపాధ్యాయులు అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు. వెంకటేశ్వర్లు, ఎం.కళాధర్ మాట్లాడుతూ సెప్టెంబర్ 15 నుంచి 19 వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన రణభేరి జాతాకు అన్ని జిల్లాల్లో ఉపాధ్యాయులు పెద్దఎత్తున సంఘీభావం తెలిపారని వివరించారు. ఈనెల 25న తలపెట్టిన రణభేరి ముగింపు సభలో కూడా అన్ని జిల్లాల నుంచి ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంఘ జిల్లా సహాధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శులు ఎం.గోవిందు, జి.వెంకటేశ్వరరావు, ఎండీ షకీలా బేగం, కె.రంగారావు, ఆడిట్ కమిటీ సభ్యులు ఎం.కోటిరెడ్డి, గఫార్, ఉదయ్ భాస్కర్, బురాన్, గోపయ్య పాల్గొన్నారు.

సమష్టి కృషితో డివిజన్‌లో అద్భుతమైన పురోగతి

రైల్వే డివిజన్ పీఆర్ఓ డి.వినయ్‌కాంత్

లక్ష్మీపురం: అధికారులు, ఉద్యోగుల సమష్టి కృషి ఫలితంగా గుంటూరు రైల్వే డివిజన్ అద్భుతమైన పురోగతి సాధిస్తోందని గుంటూరు రైల్వే డివిజన్ పీఆర్వో డి.వినయ్‌కాంత్ తెలిపారు. ఆదివారం గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో ఈ ఏడాది సాధించిన విజయాలు, అభివృద్ధి వివరాలు వెల్లడించారు. 3.809 మిలియన్ టన్నుల సరకు రవాణా చేయగా రూ.712 కోట్ల ఆదాయం సమకూరినట్లు తెలిపారు. గతేడాది కంటే 6.1 శాతం ఎక్కువని చెప్పారు. నడికుడి-శ్రీకాళహస్తి లైను 309 కిలోమీటర్లు కాగా ఇప్పటి వరకు 90 కి.మీ పూర్తయిందన్నారు. ఎర్రుబాలెం-నంబూరు (56.53 కి.మీ) లైను ఏపీ రాజధాని అమరావతిని కలుపుతుందని, భూసేకరణ పురోగతిలో ఉందన్నారు. నల్లపాడు-నంద్యాల 12 కి.మీ పూర్తయిందని తెలిపారు. నవంబర్ 2025 నాటికి గురజాల-నంద్యాల పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, డిసెంబర్ 2026 నాటికి దిగువమెట్ట-గురజాల (40 కి.మీ) పూర్తి చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. నల్లపాడు-పిడుగురాళ్ల 30 కి.మీ పూర్తి చేయనున్నట్లు తెలిపారు. డివిజన్ పరిధిలో 16 రైల్వేస్టేషన్లను అమృత్ భారత్ స్టేషన్ల పునరాభివృద్ధి కోసం రూ.300 కోట్లు మంజూరు చేసినట్లు తెలియజేశారు.

జనాభాను తగ్గించి చూపడం దారుణం

నూర్‌బాషా, దూదేకుల ముస్లిం సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పీర్ మహమ్మద్



సమావేశంలో సంఘం నాయకులు

గుంటూరు రూరల్: నగర శివారు గోరంట్లలోని ఉడ్‌లాండ్ హోటల్‌లో నూర్ బాషా, దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం రాష్ట్ర అధ్యక్షుడు కె. పీర్ మహమ్మద్ అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షలుగా ఉన్న జనాభాను ఒకటి రెండు లక్షలుగా చూపిస్తూ దూదేకులను అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం గౌరవ అధ్యక్షుడు, దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ నాగుల్‌మీరా మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి తన వంతు సేవలందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో సంఘం లైజనింగ్ కమిటీ, కోర్ కమిటీతోపాటు రాష్ట్ర అధికార ప్రతినిధిగా డాక్టర్ ఉమర్ ముక్తార్‌ను నియమించారు. ముక్తర్ మాట్లాడుతూ తన తండ్రి చమన్ ఏర్పాటు చేసిన సంఘంలో పని చేయడం గర్వకారణమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా యువతను ఏకం చేసి సంఘం అభివృద్ధికి పాటుపడతానని తెలిపారు. సంఘం సలహాదారుడు డాక్టర్ బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీం, రాష్ట్ర కోశాధికారి డాక్టర్ పర్ల దస్తగిరి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు డాక్టర్ డి. మస్తానమ్మ చేతుల మీదుగా లైజనింగ్ కమిటీ, కోర్ కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అన్ని జిల్లాల అధ్యక్షులతో పాటు రాష్ట్ర నాయకులు సాయిబాబా, డీఎస్పీ మహబూబ్ బాషా, రిటైర్డ్ ఎమ్మార్వో షేక్ షావలి, లాల్ వజీర్, నాగూర్, ఆదాం షఫీ, దిల్షాద్, రజియా, ఖాజావలి, షేక్ మస్తాన్, షరీఫ్, ఇబ్రహీం, ఖాసిం, ఆరిఫ్, మహబూబ్ బాషా, ఇమాములు, బాషా పాల్గొన్నారు.

సేవ అంటే ప్రజల నుంచి దోచుకోవడమేనా!

వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి

తాడేపల్లి రూరల్: ప్రజా సేవ అంటే దోచుకోవడమేనా అని వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి కూటమి ప్రభుత్వాన్నిప్రశ్నించారు. ఆదివారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రశ్నిస్తానని గద్దెనెక్కిన పవన్ కల్యాణ్ ఇప్పుడు మౌనంగా ఉంటున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు పవన్ కల్యాణ్ పూజ చేస్తున్నారని విమర్శించారు. ఉపాధి హామీ కూలీల గోడు వినిపించడం లేదా? అని ప్రశ్నించారు. టమాటా, ఉల్లి రైతులు గిట్టుబాటు అందక అల్లాడుతున్నారన్నారు. ఉపాధి కూలీలకు జూలై నుంచి ఇప్పటి వరకు కేంద్రం ఇచ్చిన నిధులను కూడా అందజేయకపోవడం దారుణమని మండిపడ్డారు. ధనార్జనే ధ్యేయంగా సినిమాల్లో నటించడం, టికెట్ల రేట్స్ అధికంగా పెంచడం, 4-5 రోజుల్లో ప్రజల నుంచి వందల కోట్లు దండుకోవడం సరికాదని తెలిపారు.

మద్యం మత్తులో వర్షపు నీటిలో పడి వ్యక్తి మృతి



లక్ష్మీపురం: మద్యం మత్తులో వర్షపు నీటిలో పడి వంట మాస్టర్ మృతి చెందిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. గుంటూరులోని ముత్యాలరెడ్డి నగర్ 1వ లైన్ ప్రాంతానికి చెందిన చింతాబత్తిన కుమార్ బాబు (35) అరండల్‌పేట 10వ లైన్‌లోని మెస్‌లో వంట మాస్టర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. భార్య దుర్గాదేవి బొంగరాల బీడు యూపీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తోంది. కుమార్ బాబు శనివారం అర్ధరాత్రి పూటుగా మద్యం తాగి డొంక రోడ్డు మూడు వంతెనల సెంటర్ వద్ద వర్షపు నీటిలో పడి మృతి చెందాడు. స్థానికులు భార్య దుర్గాదేవికి సమాచారం తెలియజేయడంతో హుటాహుటిన చేరుకుని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. దుర్గాదేవి ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని ప్రభుత్వ సమగ్రాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

25న విజయవాడలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితుల రక్షణపై ధర్నా



సమావేశంలో పాల్గొన్న పలు సంఘాల నాయకులు

లక్ష్మీపురం: దళితులపై దాడులు, అత్యాచారాలు ఆగాలంటే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని, లేకుంటే బాధితులకు న్యాయం జరగదని కుల వివక్ష వ్యతిరేక సంఘం(కేవీపీఎస్) రాష్ట్ర కార్యదర్శి ఆంద్ర మాల్యాద్రి అన్నారు. దళితులు, బహుజనులపై జరుగుతున్న అత్యాచారాలు, అట్రాసిటీ ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం, పోలీస్ వ్యవస్థ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ గుంటూరు బ్రాడీపేటలోని పీఎల్ రావు భవన్‌లోని కేవీపీఎస్ జిల్లా కార్యాలయంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. మాల్యాద్రి మాట్లాడుతూ దళితులపై అణచివేత కొనసాగుతున్న పరిస్థితుల్లో బహుజన సమాజం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. బాధితులు ఎన్ని ఫిర్యాదులు చేసినా పోలీసులు వెంటనే కేసులు నమోదు చేయకపోవడం, ఆలస్యం చేయ డం, లేదా ఎఫ్ఐఆర్‌లు బలహీనంగా నమోదు చేయడం వల్ల న్యాయం జరగడం లేదని అన్నారు. డీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కరవది సుబ్బారావు మాట్లాడుతూ బాధితుల పక్షాన నిలబడే మానవ హక్కుల సంఘాలు, ప్రజాసంఘాలను ప్రభుత్వం అడ్డుకోవడం మానుకోవాలన్నారు. న్యాయవాది శిఖా సురేష్ మాట్లాడుతూ కేసులను తేలికగా తీసుకుంటే న్యాయ వ్యవస్థపై ప్రజల నమ్మకం దెబ్బతింటుందన్నారు. నేరస్తులను కఠినంగా శిక్షించడమే సమాజంలో మార్పు తీసుకొస్తుందన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బి. లక్ష్మణరావు మాట్లాడుతూ దళితులు గిరిజనుల మీద జరుగుతున్న దాడులకు నిరసనగా అన్ని దళిత గిరిజన సంఘాలతో పాటు వర్గ సంఘాలు కూడా తోడై ఐక్యంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. సెప్టెంబర్ 25న విజయవాడలో జరగబోయే ధర్నాలో పాల్గొని ప్రభుత్వాన్ని కదిలించేలా పోరాటం చేస్తామని తీర్మానం చేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ట్రెక్కింగ్‌తో మానసిక వికాసం, శారీరక ఆరోగ్యం



మాట్లాడుతున్న వైహెచ్‌ఏఐ గుంటూరు యూనిట్ చైర్మన్ డాక్టర్ కె.కొండయ్య

గుంటూరు ఎడ్యుకేషన్ :ఆరోగ్యవంతులైన యువతీ, యువకులతోపాటు శరీరం సహకరించే ప్రతి ఒక్కరూ ట్రెక్కింగ్‌ను ఒక అలవాటు, హాబీగా మలచుకోవాలని యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (వైహెచ్‌ఏఐ) గుంటూరు యూనిట్ చైర్మన్ డాక్టర్ కె.కొండయ్య పేర్కొన్నారు. ఆదివారం పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో వైహెచ్‌ఏఐ గుంటూరు యూనిట్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. గుంటూరు యూనిట్ అధ్యక్షుడు చంద్రశేఖర్ అధ్యక్షత జరిగిన సమావేశంలో డాక్టర్ కొండయ్య మాట్లాడుతూ ట్రెక్కింగ్ ద్వారా అద్భుతమైన శారీరక, మానసిక ఆరోగ్యంతోపాటు విశ్వజనీన మానవునిగా సంబంధాలు కలిగి ఉండవచ్చునని అన్నారు. కలుషిత వాతావరణంలో కృత్రిమంగా జీవించేందుకు అలవాటు పడిన వారు ట్రెక్కింగ్ ద్వారా మరో అద్భుతమైన ప్రపంచాన్ని, సుందర స్వప్నాన్ని సాకారం చేసుకోవచ్చని చెప్పారు. స్వచ్ఛమైన గాలి, నీరు, పచ్చటి ప్రకృతి సంపద, తమ శబ్దాలతో పలకరించే పక్షులు, జంతువులు చెప్పలేనంత మానసిక ఆనందాన్ని కలుగజేస్తాయని వివరించారు. కార్యక్రమంలో గుంటూరు యూనిట్ ఉపాధ్యక్షుడు జానకి, కేశవరావు, కార్యనిర్వాహక కార్యదర్శులు గుణరంజన్, భాను, సంయుక్త కార్యదర్శి శ్రీలత, సభ్యత్వ నమోదు ఇన్‌చార్జ్ మల్లికార్జునరావు, కోశాధికారి సుధాకర్, పీఆర్వో మేడూరి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య

తెనాలి రూరల్: రైలు కింద పడి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చెన్నై-విజయవాడ రైలు మార్గంలో తెనాలి మండలం ఎరుకలపూడి వద్ద ఆదివారం చోటుచేసుకుంది. పట్టాలపై మృతదేహం ఉందన్న సమాచారంతో తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సుమారు 30 ఏళ్ల యువకుడి మృతదేహాన్ని గుర్తించారు. మృతుడు లేత వంకాయ రంగు టీ షర్టు, నీలం రంగు ట్రాక్ ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని తెనాలి వైద్యశాల మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, ఆచూకీ తెలిసిన వారు 7207076614 నంబరులో సంప్రదించాలని ఎస్ఐ వెంకటాద్రిబాబు కోరారు.



సన్నిధి



సానుకూలమైన ఆలోచనలు సంక్షేమానికి, విజయానికి అవసరమైన శక్తిని ఇస్తాయి. ఒత్తిళ్లను తగ్గిస్తాయి. మంచి హార్మోన్లను విడుదల చేసి, శారీరక, మానసిక ఆరోగ్యాలకు దోహదం చేస్తాయి. అందుకే గొప్పగా ఆలోచించాలి. పెద్ద పెద్ద కలలు కనాలి. ఉన్నత లక్ష్యాలను మనసులో నాటుకోవాలి.

వంద పూలై విరిసే జ్ఞాపకాలు!

జ్ఞాపకాలు గతం ఇనప్పెట్టెలో భద్రంగా ఉంటాయి. దాని మూత తీయాలని అనుకున్నప్పటి నుండి మానసిక వైబ్రేషన్‌కు గురవుతాం. చిన్ననాటి స్మృతులు ముసురుకుంటాయి. సాధారణంగా పదేళ్ళ వరకు బాల్యదశ ఉంటుంది. ఈ స్లాట్ మనిషికి స్వర్ణయుగం. ప్రతిక్షణం కుటుంబంలో, సమాజంలో, వీధిలో, ఊరిలో, బడిలో, పక్కింట్లో ప్రతిచోట ప్రతి అనుభవం గుండె గోడలమీద బొమ్మ కడుతుంది. నలుపు తెలుపు రంగుల్లో సినిమా రీల్‌లాగా గర్‌గర్ మని ఒక్కో సంఘటన మనసు తెర మీద కదలాడుతుంది.

ఒక పండగని జ్ఞాపకం అయితే మరింత సంబరం. పూలదొంతర అల్లాలంటే ఒళ్ళంతా పులకరింతే. గత పరిమళాల జల్లుల్లో తడిసి ముద్దవడమే. బతుకమ్మ పండుగ రంగుల హరివిల్లుల్ని తెంపి వెన్నెల్లో ఆరేసి, వర్షంలో తడిసిన మట్టి సుగంధాలలో నానబెట్టి, కొత్త రంగురంగుల కాంతి తరంగాలని వాటికి పట్టించి నూటొక్క మొగ్గల్ని, పూలని, ఆకుల్ని తొడిగిన పూగుత్తుల్ని పేర్చాలంటే అంత సులభం కాదు. ఇలాంటప్పుడే గత అవిస్మృత ఖజానా విలువ తెలుస్తుంది. పూలను పరిరక్షించే ఇనప్పెట్టె తయారు కానందుకు బాధ. పుప్పొడిలా రాలిన కనబడని కన్నీటి తుంపరల్ని ఎలా, ఎక్కడని దాచగలం.

మాది ఊరు కాని ఊరు. పట్టణంలో ఒదిగి ఉన్న ఊరు. వరంగల్ జిల్లాలోని హనుమకొండ. మా ఇంటి చుట్టూరా అనేకానేక చిన్నా పెద్దా ప్రాచీన గుళ్ళు, చారిత్రక ప్రదేశాలు. ఇంటికి కాస్త దూరంలో మూడు పెద్ద గుట్టల మధ్య పద్మాక్షి గుడి. గుడి కింద నీటి గుండం. అందులో బంగారు జింక ఆకర్షణలా తామరాకులు, పూలు! గుట్టల మీద సీతాఫలాలే కాదు, ఎన్నో రకాల పూలు, గునుగు పూలు, తంగేడు, గన్నేరు పూలు... ఎన్నెన్నో.



మా ఇంట్లో నాకన్నా చిన్నది చెల్లెలు. ఇంటి పక్కన పాటకుల ఇంట్లో ఓ చిట్టెమ్మ. ఇంటి పక్కల చుట్టాలు, పరిచయస్తుల ఇళ్ళల్లో ఆడపిల్లలు. వీళ్ల బొడ్డెమ్మ ఆడేవాళ్లు.

భాద్రపదం ప్రకృతి పచ్చదనానికి గర్భశిశువు. ఈ మాసం ప్రకృతి పరవశించే నిండు చూలాలు. బొడ్డెమ్మ వస్తుందంటేనే పూలవేట షురువయ్యేది. ఆడపిల్లల్ని బొడ్డి అంటారు. బొడ్డి అంటే చిన్నది అని అర్థం. ఈ ఆడపిల్లలు ఆడే బొడ్డెమ్మ ఒక ప్రత్యేక పండగ.

ఎవరి ఇంట్లోనూ పదిమంది ఆడే ఆట స్థలం ఉండేది కాదు. గుడిలోనో, ఏదో ఓక బహిరంగ ప్రదేశంలోనో వాళ్ళు వెదురుతో చేసిన చిన్న చిన్న సిబ్బిల్లో పూలు పట్టుకుని అక్కడికి చేరేవారు. అక్కడ కుమ్మరాయన మట్టితో బొడ్డెమ్మ గద్దె తయారు చేసేవాడు. కిందివైపు పెద్దగా పైపైపు చిన్న ఆకారంతో మట్టితో చతురస్రాకారంతో గద్దె కట్టేవాడు. దానికి నాలుగు దిక్కులా ప్రమిదలు పెట్టేవాడు. దానిలో రోజుకొక్కరు 9 రోజులు 9 ఇళ్ళలోంచి నూనె తెచ్చేవారు. దాని చుట్టూ రోజూ కొత్తగా ముగ్గులు వేసేవారు.ఈ పనంతా బాలికలే చేసేవారు.

ఊరి వడ్రంగి కర్రతో బొడ్డెమ్మ గద్దె చేసి ఇచ్చేవాడు. దానికి పసుపు, తెలుపు రంగులు వేసేవారు. దానిమీద కూడా ప్రమిదలు ఉండేవి. మధ్యలో పిల్ల బతుకమ్మని చెక్కేవాడు. దాన్ని జ్ఞాపకం పెట్టుకుని డెబ్బై ఐదేళ్ల తర్వాత అలాంటి కర్ర బొడ్డెమ్మ వస్తువుని ఆద్యకళ మ్యూజియం కోసం సేకరించాను.

మగపిల్లల టీం మహాలయ అమావాస్య నాడు ప్రారంభమయ్యే బతుకమ్మ కోసం సంచులు పట్టుకుని పూలవేటకు వెళ్ళేవారం. గునుగు పూలు తెచ్చి రకరకాల రంగులద్దేవాళ్ళం. తంగేడు పూలు, ఆకులు, కొమ్మలతో తెంపేవాళ్ళం. ఇంటికి వచ్చి పూలను వేరు చేసేవాళ్ళం.

జలాశయాల్లోంచి తెచ్చిన తామర ఆకుల్ని సిబ్బుల కింద ఉంచేవాళ్ళు. కొంతమంది ఎర్రని తామరపూవుని పైన అలంకరించేవాళ్ళు. పైభాగాన పసుపు ముద్ద పెట్టి గౌరమ్మ తల్లిగా సంభావించేవారు. మరి కొందరు గుమ్మడి ఆకుల్ని సిబ్బులో పరిచి బతుకమ్మ పైన గుమ్మడిపూవుని ఉంచేవారు. పూవు మధ్య భాగం కేసరాలు ఉండేచోట పసుపు రంగు ఉండేది. దాన్నే గౌరమ్మగా భావించేవారు. మేం ఇంత కష్టపడితే మాకు దక్కేది ఆటపాటల తర్వాత అక్కలు, అమ్మలు పెట్టే ప్రసాదం. రోజుకో తీరొక్క ప్రసాదం. ఇంటికోరకం ప్రసాదం తెచ్చి అన్నీ ఒక్కో గంపలో వేసి వాళ్లు తిని మాకు పెట్టేవారు. ఆ రుచే వేరు. తలుచుకుంటేనే నోరూరుతుంది.

బొడ్డెమ్మ, బతుకమ్మలను తలకెక్కించుకునే సందర్భంలో ఆకులతో చేసిన పీకలు ఊదేవాళ్ళం. మరికొందరి దగ్గర కర్రతో చేసిన గొట్టం ఉండేది. ఎండిన గింజల్నో, కాగితం తుంచి దాన్ని నమిలి చేసిన ముద్దనో కర్ర బర్మారులో పెట్టి బాగా ఊదేవాళ్లం. అది పిస్తోలు పేల్చినట్లు శబ్దం అయ్యేది. ఎవరి శబ్దం పెద్దగా ఉంటే వారిపై ప్రశంసల పూల జల్లు పడేది. అలా తొమ్మిది రోజులు ఈ కార్యక్రమం కొనసాగేది. ఆరో రోజు అరెం. అంటే ఆరోజు బతుకమ్మ పేర్చరు. సెలవుదినం. ఆట ఉండదు. మాకు కూడా కాస్త తీరిక దొరికేది. కాకపోతే బతుకమ్మ ప్రసాదం దొరికేది కాదు. పండుగ తొమ్మిది రోజులు చాలా ఇండ్లల్లో శాకాహారమే ఉండేది. కొత్త ధాన్యంతో, పప్పులతో తయారు చేసిన రుచి ఈనాటికీ గుర్తు చేసుకుంటే నోరూరుతుంది.



బతుకమ్మ తొమ్మిది రోజులు ఆటపాటలతో గడిచేది. అక్కలు, చెల్లెల్లు, కోడళ్ళు, మరదళ్లతో సందడిగా గడిపిన క్షణాలు ఈ తరాలకు దక్కని మహోత్కృష్ట గడియలు.

బతుకమ్మలనే కాదు ఇంటిని, ఇంటి పరిసరాల్ని శుభ్రపరిచి అలంకరించేవారు. ఇళ్ళ ముందు భాగం ముగ్గులు రంగులతో మెరిసిపోయేవి. వివిధ రకాల పూలు ఒక్కచోట ఉంచడం వల్ల చక్కని సువాసనలతో ఆ ప్రదేశం ఎంతో బాగుండేది. బతుకమ్మలపై కొందరు అగరుబత్తీలు పెట్టేవారు. చాలా కాలం దాచిపెట్టి పండుగ రోజున కట్టుకునే పీతాంబరం, పాత చీరల ప్రత్యేక వాసన ఇంకా పీల్చుతున్నట్లే ఉంటుంది. రోజూ అలికిన తాజా వాసన సైతం పండగ ప్రత్యేకతని చెప్పకనే చెప్పేది.

స్త్రీలు పాడే పాటలు చెవుల్లో ఇప్పటికీ వినిపిస్తూనే ఉంటాయి. బతుకమ్మ పేర్పులోని నేర్పు ఆశ్చర్యం కలిగిస్తుంది. వాళ్ళ కళాత్మక భావనల్నిచూసి వారిపై ఎనలేని ప్రేమ, గౌరవం కలిగేది. ఊరు ఊరంతా ఒక్కటై చేసుకునే పండుగ పట్ల గౌరవం ఇనుమడించేది. పండుగ కాలంలో స్త్రీలు మిగతా వాళ్ళని గౌరవంగా చూసేవాళ్ళు. అందరూ సమానమే. ఎందుకంటే అందరూ సుమంగళులే. అంటే గర్భం ధరించి పిల్లల్ని కనగలిగే అర్హత ఉన్నవాళ్ళే. వాళ్లే బతుకమ్మ ఆడాలి. వాయనాలు పెట్టుకోవాలి.

బాలికల గుంపు చిన్న మగపిల్లగాళ్ల గుంపు, యువతుల గుంపు, తల్లుల గుంపు, అమ్మమ్మ నానమ్మల గుంపు ఇలా ఎవరి గుంపు వారిదే. ఎవరి స్నేహితులతో వారు కలిసిమెలిసి ఉండేవారు. హాస్యం వందపూలై పూసేది. సామెతలతో సంభాషణ నవరసాలతో ఆకట్టుకునేది. వరసలను బట్టి హాస్యం, చతురోక్తులు ఉండేవి. ఇది పండుగ సంబరాన్ని మరింత పెంచేది.

ఊరు ఊరంతా గాన ప్రవాహంలో ఈదేది. చెరువు గట్టో, నీటి గుండాల పక్కనో వాళ్ల నృత్యంతో భూమి పులకరించేది. సంధ్యాసమయంలో ప్రకృతిని చూసి మా ఒడలు పులకరించేది.

నాడు బతుకమ్మ ప్రకృతి పండుగ. నా జ్ఞాపకాలలో ఆనాటి ప్రాకృతిక సౌందర్యం చూడడం కోసం ఊరూ, వాడా, అడవీ, పల్లె తిరుగుతూనే ఉన్నాను. ఏదో తెలియని శూన్యం. నా జీవితకాలం అంతా పద్మాక్షి గుట్ట కింద నీటి గుండంలోని తామర పూవుల సువాసన ఇంకా వెన్నాడుతోంది. కొండమీది గోగుపూలు రమ్మని చేతులు చాస్తున్నాయి. పండిన సీతాఫలాల సువాసన, రుచి, బతుకమ్మ ప్రసాదాలు తిన్నాక చాలా గంటల వరకు చేతికంటిన కమ్మని సువాసన కోసం మళ్లీ బతుకమ్మ పండుగ ఎప్పుడొస్తుందా అని ఎదురు చూపు!



– జయధీర్ తిరుమలరావు

తాత్త్వికథ

దీక్ష... దక్షత



అది కార్తీక మాసం. ఊర్లో చాలామంది అయ్యప్ప దీక్షలో ఉన్నారు. వారందరినీ చూసిన ఓ యువకుడికి కూడా అయ్యప్ప మాల ధరించాలనిపించింది. అనుకున్నదే తడవుగా శివాలయం వద్ద ఉన్న గురుస్వామి గుర్తుకు వచ్చాడు. అన్నీ సిద్ధం చేసుకుని మాలధారణకు బయలుదేరాడు. అదే సమయంలో గురుస్వామి గుడి పక్కనున్న నదిలో స్నానం చేస్తూ కనిపించాడు. ఆ యువకుడు ఒడ్డున నిలబడి నమస్కరించి ''స్వామీ, నాకు కూడా అయ్యప్ప మాల వేయాలని ఉంది. అయితే నలభై రోజుల మండల దీక్ష చేయలేను. రెండు వారాలు మాత్రమే మాల ధరిస్తాను'' అని చెప్పాడు. కారణమేమిటని అడిగాడు గురుస్వామి.

''నాకు చన్నీళ్ళ స్నానం అంటే భయం. అందుకని నలభై రోజులు ఉండలేను'' అని బదులిచ్చాడు యువకుడు. ''అదేమీ లేదు, కొన్నాళ్ళు చన్నీళ్ళ స్నానం చేస్తే అదే అలవాటైపోతుంది''అని ధైర్యం చెప్పాడు గురుస్వామి. అది అసాధ్యం అన్నట్లుగా ముఖం పెట్టాడు యువకుడు. ''సరే, నేను చెప్పినట్లు చేస్తావా?'' అని అడిగాడు గురుస్వామి.

''చన్నీళ్ళ స్నానం తప్పితే మరే పని చేయమన్నా చేస్తాను'' అని గట్టిగా చెప్పాడు ఆ యువకుడు. వెంటనే గురుస్వామి ''నీ చేతి వేలు ఈ ప్రవహించే నదిలో పెట్టు!'' అన్నాడు. అదెంత పని అన్నట్లుగా నీళ్ళలో వేలు పెట్టాడు. ఎలాగుందని అడిగాడు గురుస్వామి. చలిగా ఉందని సమాధానమిచ్చాడు యువకుడు. ఈసారి చేయి మొత్తం నీళ్ళలో పెట్టమని కోరాడు. అలాగే మొత్తం చేయి పెట్టిన యువకుడు భలే చలిగా ఉందని అరిచాడు. 'ఈసారి గట్టు నుంచి నదిలోకి దూకు!'' అన్నాడు. ఎగిరి దుమికాడు యువకుడు. వెంటనే స్వామి చలి ఎలా ఉందని ప్రశ్నించాడు. ''చలే లేదు స్వామీ! వెచ్చగా ఉంది!!'' అని నీళ్ళలో ఈతకొడుతూ బదులిచ్చాడు యువకుడు. గురుస్వామి నవ్వుతూ ''నిండా మునిగితే చలి లేదన్నారు పెద్దలు. రోజూ చన్నీళ్ళ స్నానం చేస్తే చలిగిలీ కనిపించవు. అలవాటయ్యాక చన్నీళ్ళ స్నానమే బాగుంటుందని అంటావు. చన్నీళ్ళ స్నానానికి భయపడి దీక్ష కాలాన్ని ఎందుకు తగ్గించుకుంటావు. దీక్ష ఫలితం పూర్తిగా ఆస్వాదించాలంటే నలభై రోజులు ఉంటేనే బాగుంటుంది'' అని సలహా ఇచ్చాడు. అలాగేనని సంతోషంగా నలభై రోజుల దీక్షకు ఉపక్రమించాడు ఆ యువకుడు.

– ఆర్.సి.కృష్ణస్వామి రాజు

సాక్షి సినిమా

ఈ సినిమాకి ఆ ఇద్దరే స్టార్స్ - పవన్ కల్యాణ్



● ఇమ్రాన్ హష్మీ, సుజిత్, పవన్ కల్యాణ్, డీవీవీ దానయ్య

''ఒక సినిమా కోసం ఇంతమంది ఎదురు చూస్తున్నారని నాకు తెలియదు. 'ఖుషి' చిత్రం సమయంలో ఈ జోష్ చూశాను. అలాంటి జోష్ మళ్లీ 'ఓజీ'కి వచ్చింది. సినిమాలు వదిలేసి రాజకీయాల్లోకి వెళ్లిన తర్వాత కూడా మీరు (ఫ్యాన్స్) నన్ను వదల్లేదనిపిస్తోంది.. మీరు కదా నాకు భవిష్యత్ ఇచ్చింది'' అని పవన్ కల్యాణ్ చెప్పారు. సుజిత్ దర్శకత్వంలో పవన్ కల్యాణ్, ప్రియాంకా మోహన్ జోడీగా నటించిన చిత్రం 'ఓజీ'. ఇమ్రాన్ హష్మీ, అర్జున్ దాస్, శ్రియా రెడ్డి కీలక పాత్రలు పోషించారు. డీవీవీ దానయ్య నిర్మించిన ఈ సినిమా ఈ నెల 25న విడుదల కానుంది. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'ఓజీ' ప్రీ రిలీజ్ వేడుకలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ–''సుజిత్ నా అభిమాని. 'జానీ' మూవీ చూసి నాతో సినిమా తీయాలనుకున్నాడు. 'సాహో' సినిమా తర్వాత సుజిత్‌తో సినిమా చేస్తే బాగుంటుందని త్రివిక్రమ్ చెప్పి, నాకు పరిచయం చేశారు. తను కథని ముక్కలు ముక్కలుగా చెప్పినా సినిమా తీసేటప్పుడు తన సత్తా తెలిసింది. ఈ సినిమాకి ఇద్దరే స్టార్స్... నాట్ పవన్ కల్యాణ్. వారిలో మొదటి క్రెడిట్ సుజిత్‌ది. రెండో క్రెడిట్ మ్యూజిక్ డైరెక్టర్ తమన్‌ది. 'నేను డిప్యూటీ సీఎం అని ఈ రోజు మరచిపోయాను. మీరు ఊహించుకోండి.. ఒక ఉప ముఖ్యమంత్రి ఇలా కత్తి పట్టుకుని వస్తే ఊరుకుంటారా? సినిమాల్లో కాబట్టి చెల్లిపోయింది. నేను సినిమా ప్రేమికుణ్ణి. సినిమా చేసేటప్పుడు దాని ఆలోచనలు తప్ప వేరేవి ఉండవు. రాజకీయాలు చేసేటప్పుడు అదే ఆలోచనలు తప్ప వేరేవి ఉండవు. సుజిత్ టీమ్ చాలా అద్భుతమైనది. ఇలాంటి టీమ్ నేను దర్శకత్వం వహించే టప్పుడు నాకూ ఉండి ఉంటే రాజకీయాల్లోకి వచ్చేవాణ్ని కాదేమో? ట్రైలర్ పూర్తిగా సిద్ధం కాలేదంటే కుదరదు. మా వాళ్లకి (ఫ్యాన్స్) ఈ రోజు ఎంతో కొంత చూపించాల్సిందే. నాకు తెలుసు కదా... అమితాబ్ బచ్చన్‌గారి కోసం నేను చిన్నప్పుడు ఎలా కొట్టుకునేవాణ్ణో. ఆయన సినిమాకి టిక్కెట్ దొరక్కపోతే చంపేద్దాం అనిపించేది. 'ఓజీ' చిత్రం అందర్నీ రంజింపజేసేలా ఉంటుంది'' అని చెప్పారు. ఈ ప్రీ రిలీజ్ వేడుకలో నిర్మాతలు అల్లు అరవింద్, 'దిల్' రాజు, వై. రవిశంకర్, రచయిత కోన వెంకట్, ప్రియాంక మోహన్, సంగీత దర్శకుడు తమన్, నటులు ఇమ్రాన్ హష్మి, అర్జున్ దాస్ మాట్లాడారు.

దసరాకి పాట?



● చిరంజీవి

చిరంజీవి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'. 'పండగకి వస్తున్నారు' అన్నది ట్యాగ్ లైన్. 'సంక్రాంతికి వస్తున్నాం' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో నయనతార హీరోయిన్‌గా నటిస్తున్నారు. అర్చన సమర్పణలో షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌పై సుష్మిత కొణిదెల నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. 2026 సంక్రాంతి కానుకగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ మూవీకి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే కొన్ని పాటలను సిద్ధం చేశారట భీమ్స్. ప్రమోషన్లలో భాగంగా దసరా సందర్భంగా 'మన శంకర వరప్రసాద్ గారు' నుంచి తొలి పాటను విడుదల చేయాలనే ఆలోచనలో ఉన్నారట మేకర్స్. వినాయక చవితి పండగని పురస్కరించుకుని ప్రత్యేక పోస్టర్‌ని విడుదల చేసిన యూనిట్.. ఇప్పుడు దసరాకి తొలి పాట రిలీజ్ చేసి, సినిమాపై మరింత క్రేజ్ పెంచాలన్నది ఆలోచనట. మరి... దసరా పండగకి పాట విడుదల చేస్తారా? లేదా? లేకుంటే మరేదైనా అప్‌డేట్ ఉంటుందా? అన్నది వేచి చూడాలి. ఇదిలా ఉంటే.. చిరంజీవి హీరోగా వశిష్ఠ దర్శకత్వం వహించిన 'విశ్వంభర' సినిమా 2026 వేసవిలో రిలీజ్ కానుంది.

అక్టోబరులో ఆరంభం



● వెంకటేశ్

వెంకటేశ్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం రూపొందనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటించనున్నారని సమాచారం. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను అక్టోబరు మొదటివారంలో ప్రారంభించనున్నారని తెలిసింది. తొలి షెడ్యూల్‌లోనే వెంకటేశ్‌తో పాటు ఈ చిత్రం ప్రధాన తారాగణం పాల్గొనగా, కీలక సన్నివేశాల చిత్రీకరణను ప్లాన్ చేశారట త్రివిక్రమ్. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇక ఈ సినిమాకు 'ఆనంద నిలయం, వెంకటరమణ: కేరాఫ్ ఆనంద నిలయం' అనే టైటిల్స్‌ను మేకర్స్ పరిశీలిస్తున్నారని, వైజాగ్ నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. ఈ అంశాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇదిలా ఉంటే... వెంకటేశ్ హీరోగా నటించిన 'నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి' చిత్రాలకు త్రివిక్రమ్ కథ, సంభాషణలు అందించారు. ఈ రెండు సినిమాలూ విజయాలు సాధించాయి. దీంతో వెంకటేశ్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందనున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో అంచనాలు ఉండటం సహజం.

బ్యూటీ నాకు ఎంతో ప్రత్యేకం - వీకే నరేశ్



● అంకిత్, నీలఖి, వీకే నరేశ్

''నా కెరీర్‌లో ఎన్నో ఎత్తుపల్లాలు చూశా. ఇన్నేళ్ల నా కెరీర్‌లో 'బ్యూటీ' చిత్రం మాత్రం నాకు ఎంతో ప్రత్యేకం. అన్ని వర్గాల వారికి కనెక్ట్ అయ్యే సినిమా ఇది. లవ్, ఎమోషన్స్, ఫ్యామిలీ... ఇలా అన్ని అంశాలను జోడించిన ఈ చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్'' అని నటుడు వీకే నరేశ్ తెలిపారు. అంకిత్ కొయ్య, నీలఖి జంటగా నటించిన చిత్రం 'బ్యూటీ'. వీకే నరేశ్, వాసుకి ప్రధాన పాత్రలు పోషించారు. జె.ఎస్.ఎస్. వర్ధన్ దర్శకత్వంలో వానర సెల్యులాయిడ్, జీ స్టూడియోస్, మారుతి టీమ్ ప్రొడక్ట్‌పై అడిదల విజయపాల్ రెడ్డి, ఉమేష్ కుమార్ బన్సల్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 19న విడుదలైంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ మూవీ సక్సెస్ మీట్‌లో అంకిత్ కొయ్య మాట్లాడుతూ– ''బ్యూటీ' అన్ని వర్గాల ప్రేక్షకులకు చేరువైంది. క్లయిమాక్స్ తర్వాత అందరూ కన్నీళ్లు తుడుచుకుంటున్నారు. అదే మా విజయం'' అని చెప్పారు. ''మా సినిమా అందర్నీ అలరిస్తోంది. 15 థియేటర్స్‌కి వెళ్లాను.. ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తున్నారు'' అన్నారు జె.ఎస్.ఎస్ వర్ధన్. ''మన జీవితాల్ని చూపించే చిత్రమిది. ఇది కేవలం సినిమా కాదు.. జీవితం'' అని అన్నారు విజయ్‌పాల్ రెడ్డి. ''నా పాత్రకి ప్రశంసలు కురిపిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు'' అని నీలఖి తెలిపారు. రైటర్ ఆర్.వి. సుబ్రహ్మణ్యం, కెమెరామేన్ సాయి కుమార్ ధారా, సీనియర్ జర్నలిస్ట్ ప్రభు తదితరులు మాట్లాడారు.

దేవగుడి విజయం సాధించాలి - మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డి



● ఆది నారాయణరెడ్డి, రామ్‌ప్రసాద్ రెడ్డి, బెల్లం రామకృష్ణారెడ్డి, అభినవ శౌర్య, అనుశ్రీ

''దేవగుడి' సినిమా ఫస్ట్ లుక్, గ్లింప్స్ బాగున్నాయి. ఈ చిత్రంలోని డైలాగులు మా కడప మాండలికంలో ఉండటం నాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. ఈ సినిమా మంచి విజయం సాధించి, దర్శక–నిర్మాత రామకృష్ణారెడ్డిగారికి, నటీనటులకు, సాంకేతిక నిపుణులకు పేరు తీసుకు రావాలి'' అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి చెప్పారు. అభినవ శౌర్య, నరసింహ, అనుశ్రీ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'దేవగుడి'. బెల్లం సుధా రెడ్డి సమర్పణలో బెల్లం రామకృష్ణా రెడ్డి స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఆదివారం నిర్వహించిన ఈ చిత్రం ఫస్ట్ లుక్, గ్లింప్స్ లాంచ్ ఈవెంట్‌కి మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి, ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆది నారాయణరెడ్డి మాట్లాడుతూ–''సినిమాలు వినోదం కోసమే కాదు... ప్రేక్షకులకు మంచి సందేశాన్నిచ్చేలా ఉండాలి'' అన్నారు. ''నవంబరులో విడుదల కానున్న మా సినిమాని ప్రేక్షకులు ఆదరించాలి'' అని బెల్లం రామకృష్ణారెడ్డి కోరారు. సంగీత దర్శకుడు షేక్ మదీన్, కెమెరామేన్ లక్ష్మీకాంత్, నటుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఓటీటీ | ఇది చూడొచ్చు

సమాజపు పరదా తీసిన సినిమా

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో తెలుగు చిత్రం పరదా ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కాలం నడుస్తున్నా, ఇంకా ఎక్కడో ఈ సమాజంలో మూఢనమ్మకమనే పరదా ఉంది. మరీ ముఖ్యంగా ఇది ఉత్తర భారతంలో కొన్ని రాష్ట్రాలలో ఎక్కువగా ఉంది. ఆ మూఢనమ్మకపు పరదాని చాలా సున్నితమైన కథాంశంతో మన ముందుకు తీసుకువచ్చారు దర్శకుడు ప్రవీణ్. ఈ సినిమా ప్రధాన పరదాలో (పాత్రలో) కథానాయిక అనుపమా పరమేశ్వరన్ నటించారు. మరో ప్రధాన పాత్రలో మలయాళ నటి దర్శనా రాజేంద్రన్, అలాగే మరో పాత్రలో సంగీత నటించి, మెప్పించారు. ఈ కథలో సున్నితమైన అంశాన్ని ఎంతో హృద్యంగా మలిచారు దర్శకుడు. అంతలా ఏముందో ఈ కథలో ఓసారి చూద్దాం. ఓ మారుమూల గ్రామంలో వింతైన ఓ ఆచారాన్ని పాటిస్తుంటారు. తమ గ్రామాన్ని దేవత శపించిందని, శాప విమోచన కోసం గ్రామంలో ఉన్న ప్రతి అమ్మాయి తప్పనిసరిగా బయటకు వచ్చినపుడు పరదాతోనే రావాలని ఆచారం ఉంటుంది. ప్రతి అమ్మాయి తమ కుటుంబ సభ్యులను తప్ప మిగతా వారందరి దగ్గర పరదాతోనే ఉంటుంది. వాళ్ళలో సుబ్బలక్ష్మి (అనుపమ) కూడా ఉంటుంది. కాకపోతే సుబ్బలక్ష్మి చదువుకున్న అమ్మాయి. అయినా తమ గ్రామంలో తరతరాల నుండి వస్తున్న సాంప్రదాయాన్ని తూచా తప్పకుండా పాటిస్తుంటుంది. కానీ ఓరోజు గాలి వాటాన సుబ్బలక్ష్మి పరదా తొలగిపోతుంది. అప్పుడు సుబ్బలక్ష్మికి కూడా తెలియకుండా ఓ ఫేమస్ మేగజీన్ ఫొటోగ్రాఫర్ సుబ్బలక్ష్మి ఫొటో తీసి ప్రచురిస్తాడు. సరిగ్గా సుబ్బలక్ష్మి పెళ్ళి సమయంలో ఆ మేగజీన్ బయటపడి ఊరు మొత్తం సుబ్బలక్ష్మి ముఖాన్ని చూసేస్తుంది. దాంతో అల్లకల్లోలం అవుతుంది. దీనికి ప్రతిగా సుబ్బలక్ష్మి ఆత్మహత్య చేసుకోవాలని ఊరువాళ్ళు నిర్ణయించినా ఓ మేజిక్ వల్ల ఆత్మహత్య ఆగిపోతుంది. అప్పుడు సుబ్బలక్ష్మి ఊరి కోసం ఆ ఫొటోగ్రాఫర్‌ని వెతికి పట్టుకుని తన తప్పు లేదని నిరూపించుకుంటానని, లేదంటే అప్పుడే ఆత్మహత్య చేసుకుంటానని ఫొటోగ్రాఫర్ కోసం హిమాలయాల్లో ఉన్న ధర్మశాలకు బయలుదేరుతుంది. మరి... సుబ్బలక్ష్మి ఆ ఫొటోగ్రాఫర్‌ని వెతికి పట్టుకుందా? తిరిగి ఊరెళ్ళిన తరువాత అక్కడ తనకు ఎదురైన పరిస్థితులు ఏంటి? అన్నది మాత్రం ప్రైమ్ వీడియో వేదికగా స్ట్రీమ్ అవుతున్న 'పరదా' సినిమాలోనే చూడాలి. ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎవరికైనా, ఎలాగైనా నమ్మకం ఉండొచ్చు కానీ మూఢనమ్మకమనే పరదా మాత్రం ఉండకూడదు. నేటి సమాజంలో ఇంకా మూఢనమ్మకాలనే పరదాలను తీసేసిన సినిమా ఈ 'పరదా'. పిల్లలు కాకుండా పెద్దవాళ్లు చూడదగ్గ సినిమా ఇది.



– హరికృష్ణ ఇంటూరు